క్లుప్తంగా

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పరవాడ: ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని కన్నూరు, మడకపాలెం గ్రామాల్లో ఉపాధి కూలీలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలో నాలుగు వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వేతన దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోజుకు రూ.300 చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా అమలు కాలేదన్నారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. వెన్నలపాలెం, పి.బోనంగి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించకపోవడంతో అక్కడి కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి కార్మికులను ఆదుకోవాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

మర్యాద పూర్వక కలయిక



మంత్రి రామనారాయణరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆనం రామనారాయణరెడ్డిని గురువారం సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, వైదికులు అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి జ్ఞాపిక, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈ హరి, వేద పండితులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

స్కూల్ ఆటోడ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి


- ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కర్



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కర్

విశాఖసిటీ: నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిరుగుతున్న ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ద్వారకానగర్ ట్రాఫిక్ విభాగం ఎస్‌ఐ భాస్కర్ సూచించారు. ద్వారకానగర్ శ్రీచైతన్య స్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్‌ఐ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించే తనిఖీలకు సహకరించాలన్నారు. విద్యార్థులతో వస్తున్నప్పుడు డ్రైవర్లు రహదారి క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ మాట్లాడుతూ భావితరాలకు వారధులైన విద్యార్థుల భద్రత ఆటోడ్రైవర్ల చేతుల్లో ఉందన్నారు. అలాగే బాలికల భద్రత విషయంలోనూ డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సూచించారు. సమావేశంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ఆర్‌ఐ అలీ, డీన్‌లు గౌరినాయుడు, సురేష్, ఏవో దిలీప్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన



సీపీకి వినతులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



సుజాతనగర్ కమ్యూనిటీ హాల్‌లో..



యోగాసనాల్లో ఎన్టీపీసీ ఉద్యోగులు



రవీంద్రభారతి పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా యోగ దినోత్సవం

యోగా దినోత్సవాన్ని శుక్రవారం పలు కార్యాలయాలు, సంస్థలు, విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు యోగసనాలు వేశారు. యోగా గురువులు యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రపంచానికి దిశా నిర్దేశం చేసే యోగా మనదే అని తెలిపారు. ప్రపంచం మొత్తం యోగా వెంట నడుస్తోందని పేర్కొన్నారు.



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యోగసనాలు వేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

పెందుర్తి: యోగతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగ గురువులు చెప్పారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు ప్రాంగణంలో అయుష్మాన్ దివ్య యోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో పతంజలి యోగాసనాలు వేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాపర్తి శ్రీను ఆసనాలపై అవగాహన కల్పించారు. యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు రక్తపోటు, చక్కెర వ్యాధి, థైరాయిడ్ వంటి రోగాలతో బాధపడుతున్న వారికి యోగా అనేక విధాలుగా దోహదపడుతుందన్నారు. యోగ సాధనతో మనిషి శరీరంలోని 72 వేల నాడులు చక్కగా పనిచేస్తాయన్నారు. ప్రాణాయామం, అష్టావదాన, పాదహస్త, పర్వత, ఆశ్వసం, శశాంక వంటి ఆసనాలను ప్రదర్శింపజేశారు. విజేతలకు ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి డి.ఎస్ సుందర్, కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

- పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యోగ డే సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.
- సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో యోగా డే ఘనంగా నిర్వహించారు. యోగ గురువుల సూచనల మేరకు సిబ్బంది, విద్యార్థు లు యోగాసనాలు వేశారు. డీజీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.
- పెందుర్తి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కలిగించారు. గ్రంథాల యాధికారి సూర్యకళ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.
- సుజాతనగర్ ఫ్రెండ్స్ పవర్ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ డే ఘనంగా నిర్వహించారు. యోగ గురువులు సూరపునేని పాండురంగారావు, గొల్ల రామునాయుడు, ప్రతినిధులు గంట్ల దేముడు, జి.రమణమూర్తి, ఎం.దుర్గా మాధవి తదితరులు పాల్గొన్నారు.



పతంజలి సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాలు వేస్తున్న సాధకులు

ఎన్టీపీసీలో..

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దీపాంజలినగర్‌లో ఉద్యోగులు, విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. యోగా ద్వారా మానవ జీవితంలో కలిగే ప్రయోజనాలను యోగా గురువు వివరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యోగా తరగతుల నిర్వహణకు ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం తనవంతు సహకారం అందిస్తుందని యోగా గురువు తెలియజేశారు. ఈ ఏడాది యోగా డే థీమ్ యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అని చెప్పారు. కార్యక్రమంలో సీజీఎం (సిపిజి-3) ఆర్.ఆర్.పరిదా, జీఎం (సిఅండ్ఎం సిపిజి-3) వి.టి.కాంబ్లే, డీసీ (సీఐఎస్ఎఫ్) వి.కె.ప్రభాకర్, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు, దీపాంజలినగర్ వాసులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ ఉన్నతాధికారులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జీవితంలో యోగా భాగం

పరవాడ: యోగా నిత్య జీవితంలో భాగం కావాలని అనకాపల్లి జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆమె ప్రసంగించారు. యోగా సాధన చేస్తే క్రమశిక్షణ, ఆరోగ్యం ఆనందం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు చక్కగా ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఏపీ ఎన్‌జీసీ సంయుక్తంగా నిర్వహించిన వ్యాస రచన, చిత్ర లేఖనం, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్‌రావు, హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు, పీడీ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు ఎస్.కూర్మారావు, వరలక్ష్మి, ఎస్.ఎన్.రెడ్డి, సౌజన్య, విక్టోరియా ఫ్రాన్సిస్, రమేష్‌బాబు, శ్యామసుందర్, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, అప్పలరాజు, ఇందిర, ఉమా, అరుణజ్యోతి, సుజాత, కామేశ్వరి, మంగవేణి, పుణ్యవతి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

యోగతో ఒత్తిడి దూరం

సింహాచలం: యోగతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ఒత్తిడి దూరమవుతుందని సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని శుక్రవారం దేవస్థానం పరిపాల నా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంస్కృతోన్నత పాఠశాల, వేద పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులతో యోగాసనాలను యోగ అధ్యాపకుడు, దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ వేయించారు. ఏఈవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు రెహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం యోగాపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ శుభాషిణి ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు.
- సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.
- దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ నందినితో పాటు అధ్యాపకులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు



సబ్బవరం జూనియర్ కళాశాలలో..



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు



యోగా చేస్తున్న సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు



యోగాసనాలు ప్రదర్శిస్తున్న వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

- కంచరపాలెం పీఎస్ పరిధిలో విస్తృతంగా దాడులు

మద్దిపాలెం: గంజాయి, డ్రగ్స్ మూలాలను అరికట్టేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్‌ను పారదోలేందుకు చర్యలు ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి నేతృత్వంలో అనేక చోట్ల గంజాయి, మత్తు పదార్థాలపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గత అర్ధరాత్రి అనేక చోట్ల దాడులు నిర్వహించారు. పెందుర్తి సీఐ రామకష్ణ ఆరుగురు సిబ్బందితో కలిసి కైలాసపురం, రాంజీ ఎస్టేట్, కప్పరాడ, డీఎల్‌బీ క్వార్టర్స్ ఏరియాల్లో గురువారం రాత్రి గంజాయిపై దాడులు చేశారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షేక్ సమీర్ జ్ఞానాపురం, చాకలిగెడ్డ, ఆర్పీ పేట, సబాస్టియన్ కాలనీ, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆరుగురు సిబ్బందితో కలిసి, ఎస్‌ఐ దివ్యభారతి ఐటీఐ జంక్షన్, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గంజాయిపై తనిఖీలు చేపట్టారు. పెందుర్తి ఎస్‌ఐ సింహాచలం ధర్మానగర్, కంచరపాలెం ప్రాంతంలో, కంచరపాలెం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి ఎనిమిది మంది సిబ్బందితో కలిసి బర్మాక్యాంప్, మురళీనగర్, మాధవధార, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి రోజూ తనిఖీలు నిర్వహించి గంజాయి అరికట్టేందుకు కృషిచేస్తామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్ తీసుకుంటున్న వారు ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నృసింహ స్వామికి వైభవంగా గరుడ సేవ

- పాల్గొన్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి
- పోటెత్తిన ఒడిశా భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిర్వహించిన గరుడ సేవలో ఒడిశా భక్తులు తరించారు. లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ స్వామికి ఈసేవను జరిపించారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, పట్టుపురం, బరంపురం, పూరి, రాయగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ సేవకు హాజరయ్యారు. సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని అలంకరించి వెండి గరుడ వాహనంపై అధిష్టించారు. శ్రీదేవి,భూదేవి అమ్మవార్లను పల్లకీలో వేంచేయజేసి మంగళ వాయిద్యాలు, భక్తుల జేజేలు మధ్య గరుడసేవ నిర్వహించారు. వింజామరతో లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ స్వామికి సేవలందించగా, తమ సంప్రదాయం ప్రకారం ఒడిశా భక్తులు స్వామిని కీర్తించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈసేవ నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా పాల్గొన్నారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



అమ్మవార్లు వేంజేసిన పల్లకీ మోస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్య ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు అర్చకులు అందజేశారు.

ఉమాదేవికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన ఉమాదేవి ఆలయంలో శుక్రవారం కుంకుమలు పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ ప్రాంతం నిర్వహణ కోసం ఒక ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతుబజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు అందజేయాలన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇస్తామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8.202/2, ఆర్ ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం-530029కు అందించాలన్నారు. వివరాలకు 90308 19082 నంబర్‌లో సంప్రదించాలని జేసీ కోరారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



మృతుడు బొర్రా చంద్రశేఖర్(ఫైల్)

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. టిడ్కో గృహ సముదాయానికి సమీపంలోని చెరువు గట్టు వద్ద చెడు వాసన వస్తుందని స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు బొర్రా చంద్రశేఖర్(47)గా గుర్తించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. శ్రీకాకుళానికి చెందిన బొర్రా అప్పారావు కుమారుడు చంద్రశేఖర్, తల్లితో కలిసి గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలోని టిడ్కో కాలనీలో 45 రోజుల కిందట అద్దెకు దిగారు. చంద్రశేఖర్ ఫార్మాసిటీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న తాగడానికి తల్లి డబ్బులు ఇవ్వలేదని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా మృతుడు చంద్రశేఖర్ తప్పిపోయిన రోజు పూటుగా తాగి ఉన్నాడని చెరువు గట్టు పై నుంచి వెళుతుండగా పడిపోయి లేవలేని పరిస్థితిలో మరణించి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసును దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ మల్లేశ్వరరావు చెప్పారు.

వెంకన్న సన్నిధిలో సరస్వతీ హవనం



స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహా సరస్వతీ హవనం వేడుకగా నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదువుకున్న 1000 మంది విద్యార్థులు సమర్పించిన 1008 నారి కేళాలతో స్వామికి అభిషేకాలు జరిపారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు చేశారు. విద్యార్థులకు దేవస్థానం తరపున ఈవో నీలిమ ఆధ్వర్యంలో పెన్, పుస్తకం అందించా రు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.